క్లుప్తంగా

నేడు ముత్యాలమ్మకు సేవ

మలికిపురం: గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గురువారం జనడ స్రవంతిక రజక సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక సేవ జరుగుతుందని సంఘ కమిటీ బుధవారం తెలిపింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని కమిటీ పేర్కొంది.

నేటి నుంచి అయ్యప్ప వార్షిక మహోత్సవాలు

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లిలో ఈనెల 13 నుంచి అయ్యప్ప స్వామి వారి ఆలయ వార్షిక మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కాళెట్టి ప్రకాష్ స్వామి, కోన విఘ్నేశ్వరస్వామి తెలిపారు. రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

నాలుగు రోజుల పాటు అన్నసమారాధనలు

మలికిపురం: మండలంలోని గూడపల్లి నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకూ 4 రోజుల పాటు భారీ అన్నసమారాధనలు జరుగుతాయని ఆలయ చైర్మన్ సుందర నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కమిటీ సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు. నెల రోజులుగా జరుగుతున్న అమ్మవారి తీర్థం ఈ నెల 19తో ముగుస్తుందన్నారు. భక్తులు గమనించాలని సూచించారు. సమావేశంలో సుందర తాతాజీ, చెల్లుబోయిన వీవీ సత్యనారాయణ, పెచ్చెట్టి నరసింహస్వామి, కటికిరెడ్డి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనకు సీఎం నిర్ణయంపై హర్షం


పాటి శివకుమార్

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ కులగణనకు కీలక నిర్ణయం తీసుకోవడంపై రామేశ్వరానికి చెందిన నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సఖినేటిపల్లిలో ఆయన మాట్లాడుతూ, బీసీల ఆకాంక్ష నెరవేర్చే దిశగా సీఎం జగన్ తీసుకుంటున్న చర్యలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాల తరబడి కలగా మిగిలిపోయిన బీసీ కులగణన అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపడం ద్వారా బీసీలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

వైఎస్సార్ సీపీ కొత్తపేట అధ్యక్షుడిగా బ్రహ్మాజీ



కొత్తపేట: గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా సలాది బ్రహ్మాజీ నియమితులయ్యారు. ఇంతవరకూ గ్రామ పార్టీ అధ్యక్షుడిగా పేపకాయల బ్రహ్మానందం వ్యవహరిస్తూ వచ్చారు. ఆయన ఎంపీటీసీ, హెచ్‌డీసీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పార్టీ బాధ్యతలు కూడా భారం కావడంతో ఆయన స్థానంలో ఈ గ్రామ పార్టీ అధ్యక్షుడిగా సీనియర్ యువజన విభాగం నాయకుడు సలాది బ్రహ్మాజీని బుధవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీని శాలువా, పార్టీ కండువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గాయపర్చిన ముగ్గురిపై కేసు

అయినవిల్లి: అక్కతమ్ముళ్లను గాయపర్చిన ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఎస్.పెదపాలెంలో మంగళవారం రాత్రి బొక్కా లక్ష్మణరావు, చక్రవర్తి, రామకృష్ణలు గొడవపడుతున్నారు. రాత్రి సమయంలో గొడవలేంటి అని సానబోయిన ఉమాలక్ష్మి, ఆమె సోదరుడు ముషిణి ఈశ్వరరావు అడిగారు. దీంతో ఆగ్రహించిన లక్ష్మణరావు, చక్రవర్తి, రామకృష్ణలు ఉమాలక్ష్మి, ఈశ్వరరావులను గాయపరిచారు. దీనిపై ఉమాలక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాజీ సర్పంచ్ వెంకన్న మృతి

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సలాది వెంకన్న (76) బుధవారం మృతి చెందారు. ఆయన గత కొద్ది కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి తోడు వృద్ధాప్య సమస్యలు అధికం కావడంతో ఇంటి వద్దనే చికిత్స తీసుకుంటూ మృతి చెందారు. 1988-93 మధ్య కాలంలో వెంకన్న తొలిసారి గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించి గ్రామాభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించారు.

నేడు మెర్లపాలెంలో గడప గడపకూ..

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెంలో గురువారం ఉదయం 6.30 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో నాతి బుజ్జి తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. గ్రామంలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు. అనంతరం రాజవరంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొంటారని సీనియర్ పార్టీ నేత కొల్లి శ్యాంసన్ తెలిపారు.

ఎత్తిపోతలతో లంక భూములు సస్యశ్యామలం

- అప్పనపల్లి పథకం కోసం రైతుల ఎదురుచూపు
- ప్రాజెక్టు పూర్తి చేయాలని విన్నపం

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరంలోని లంక గ్రామాల రైతులు సుదీర్ఘ కాలం నుంచి సాగు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎంతో సారవంతమైన భూములు సరైన సాగునీరు లేక నిస్సారంగా మారిపోయాయి. భూగర్భం నుంచి వచ్చే జలాలు ఉప్పునీటిమయంగా మారడం రైతులను కలవరపెడుతోంది. ఉప్పునీటి ప్రభావంతో కొబ్బరికాయల దిగుబడులు గణనీయంగా పడిపోతోంది. వేలాది రూపాయలు వ్యయం చేసి ఏటా వేసవిలో రైతులు కొబ్బరి తోటలకు నీటి తడులు పెడుతున్నారు. దీని కోసం ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సిన పరిస్థితి. ఎంతో మంది పాలకులు మారినా రైతుల పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. లంక గ్రామాలకు సాగునీరందించే అప్పనపల్లి ఎత్తిపోతల పథకానికి కార్యాచరణ చేపట్టామని గత పాలకులు చెప్పినా ఫలితం శూన్యం. ఎట్టకేలకు ఈ పథకం నిర్మాణానికి కార్యాచరణ చేపట్టామని అధికారులు చెబుతున్న మాటలు రైతుల్లో ఉత్సాహం నింపుతున్నాయి.

నాలుగు వేల ఎకరాలకు మేలు...

అప్పనపల్లి, పెదపట్నంలంక, పెదపట్నం, బి.దొడ్డవరం, మానేపల్లి గ్రామాలకు అప్పనపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మేలు జరుగుతుంది. చుట్టూ పుష్కలంగా గోదావరి జలాలు అందుబాటులో ఉన్నా ఆ జలాలు ఉప్పునీటి మయం కావడంతో ఇక్కట్లు తప్పడం లేదు. అప్పనపల్లి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు రూ.46.46 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. అయిదు గ్రామాల్లో 15 కిలోమీటర్ల పంట కాలువ ఏర్పాటుతో 4,035 ఎకరాల్లోని కొబ్బరి తోటలకు ప్రయోజనం కలుగుతుంది. దీంతో పాటు కొబ్బరి తోటల్లో అంతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. బ్రిటీషు వారి హయాంలో పై అయిదు గ్రామాలకు ఇరిగేషన్ సదుపాయం ఉండేది. ప్రస్తుతం ఈ గ్రామాలకు ఇరిగేషన్ సదుపాయం లేకపోవడంతో ఆ గ్రామాల రైతులు బోరు బావులపై ఆధారపడి కొబ్బరి సాగు చేస్తున్నారు. అప్పనపల్లి ఎత్తిపోతల పథకం కార్యరూపం దాల్చితే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.


లంక గ్రామాలకు సాగునీటిని అందిస్తున్న బోరు బావులు

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



అప్పనపల్లి ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. లంక గ్రామాల పరిస్థితిని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లా. ఆయన సానుకూలంగా స్పందించారు. రూ.46.46 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నాం. అయిదు గ్రామాలకు సాగునీరు అందించే బృహత్తర కార్యక్రమం చేపడుతున్నాం. ఈ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.
– కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్యే, పి.గన్నవరం

పథకం పూర్తి చేయాలి



నాకు ఎకరం కొబ్బరి తోట ఉంది. దానికి నీరు కట్టేందుకు ఏటా ఒక తడికి అయిదు వేలు ఖర్చవుతుంది. వేసవిలో మూడు నీటి తడులు కట్టాల్సి ఉంది. దానికి గాను రూ.15 వేలు ఖర్చు చేస్తున్నా. బోరు బావుల నుంచి వచ్చే నీరు ఉప్పునీరు కావడంతో తోటలు చవుడు బారి కొబ్బరి తోటలు దెబ్బతింటున్నాయి. అంతరపంటలు పండడం లేదు. సాగునీరు అందిస్తే చాలా మందికి మేలు జరుగుతుంది.
– కాండ్రేగుల శ్రీనివాస్, రైతు, బి.దొడ్డవరం

సాగునీరు అందించాలి



నేను పదెకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నాను. సాగు నీరు అందిస్తే లంక భూముల్లో బంగారం పండుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉప్పునీటితో వ్యవసాయం సర్వ నాశనమైంది. గతంలో లంక గ్రామాల్లో ఎన్నో పంటలు పండించే వారు. నీటి సమస్యతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సాగు నీరు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
– కొమ్ముల రామారావు, రైతు, పెదపట్నంలంక

విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా ఎస్పీ పూజలు


విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.శ్రీధర్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు పూజలు చేశారు. తొలుత ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు, ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వాదం పలికి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ చరిత్రను వివరించారు.

మృతుని కుటుంబానికి బీమా సాయం

కొత్తపేట: స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన సలాది రాంబాబు గుండెపోటుతో మృతి చెందగా అతడి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేలు మంజూరయ్యాయి. ఆ నగదును బుధవారం రాష్ట్ర పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ నాయకుడు కర్రి నాగిరెడ్డి చేతుల మీదుగా మృతుడి కుటుంబానికి అందచేశారు. కార్యక్రమంలో అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, యర్రంశెట్టి నాయుడు, గ్రామ కార్యదర్శి వీవీ రామన్ పాల్గొన్నారు.

దేశ చరిత్రలో ఇంటింటికీ సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేట, కొమరాజులంకల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపేట: రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశ చరిత్రలోనే ఏ ప్రభుత్వం అమలు విధంగా ఇంటింటికీ వివిధ పథకాల ద్వారా సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక 5 వ సచివాలయం పరిధిలోని బోడిపాలెం, రాణిగారి తోట ప్రాంతాల్లో బుధవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాల వారిని ఆప్యాయంగా పలకరించారు. వారికి వర్తించిన సంక్షేమ పథకాలు అందాయంటూ దాదాపు అందరూ ఆనందంగా వివరించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై, ఎమ్మెల్యే జగ్గిరెడ్డిపై ఆయా కుటుంబాల వారు అభిమానం వ్యక్తం చేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. సీఎం జగన్, తనపై మీరందరూ చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. మీ అభిమానం ఎప్పుడూ ఇలాగే ఉండాలమ్మా.. అని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, మండల యువజన విభాగం కన్వీనర్ గొల్లపల్లి స్వరూప్‌రాజ్, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను, సచివాలయ ఇన్‌చార్జ్‌లు, గృహ సారథులు మూర్కొండ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాజులంకలో..

రావులపాలెం: అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీ చింతా అనురాధలు అన్నారు. బుధవారం మండలంలోని కొమరాజులంక సచివాలయం-1 పరిధిలోని వెంకటేశ్వరస్వామి గుడి వీధి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ చింతా అనురాధ హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమాన్ని వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ కర్రి గోవిందకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరై ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వెంట తిరిగారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి అందిన ప్రభుత్వ పథకాలు లబ్ధిని వివరిస్తూ వారికి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకటనాగదేవి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచులు అంబటి సుబ్బలక్ష్మి, దొమ్మేటి అర్జునరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సెక్రటరీ నిమ్మకాయల బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.


కొమరాజులంక మెయిన్‌రోడ్డుకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ చింతా అనురాధ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి


కొత్తపేటలో పథకాల పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం ఎంపీ చింతా అనురాధలు అన్నారు. బుధవారం మండలంలోని కొమరాజులంకలో పలు అభివృద్ధి కార్యక్రమాలను వారు ప్రారంభించారు. రూ.4 కోట్లు సీఆర్ఎఫ్ నిధులతో సీసీ రోడ్డుగా నిర్మించనున్న కొమరాజులంక మెయిన్ రోడ్డుకు వారు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.10.50 లక్షలతో నిర్మించిన రజకుల కాలనీ, సూర్యనారాయణమూర్తి గుడి ఎదురుగా, ఎస్సీ అరుంధతి పేట, పురిగిరి క్షత్రియుల వీధి, తదితర మరో రూ.9.50 లక్షల నిధులతో నిర్మించిన ఆరు సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే రూ.8 లక్షలతో నిర్మించిన అరుంధతి కాలనీ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని, రూ.8 లక్షలతో నిర్మించిన హరిజన కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహన్ని వారు ఆవిష్కరించారు. రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభించారు.

అన్ని వర్గాల్లోనూ జగన్ ప్రత్యేక ముద్ర

అయినవిల్లి: అన్ని వర్గాల్లోనూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక ముద్ర వేసుకున్నారని ఆయన్నే మరలా సీఎం కుర్చీలో రాష్ట్ర ప్రజలు కూర్చోబెడతారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం మండలంలోని నేదునూరు పరిధిలో ఎస్.సావరం, జమ్మిచెట్టు ప్రాంతాల్లో గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు గ్రామంలో గడపగడపకూ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ పథకాలు అందుతున్నాయా? లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ అర్హత బట్టి అందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. ఆయన్నే మరలా సీఎంగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చిట్టిబాబు కోరారు. గ్రామంలో రహదారులు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయడానికి అధికారులతో చర్చించి చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాలు, గృహరుణాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గడగగడపకూ కార్యక్రమం ప్రారంభించి 175 రోజులు పూర్తి అవుతున్న సందర్భంగా గ్రామంలో మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహం వద్ద కేకు కట్ చేసి సంబరాలు జరిపారు. తొలుత ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, నాయకులు బయ్యా చిన బాబు, చెల్లుబోయిన శ్రీను, పేరి శ్రీను, కొండేటి స్టాలిన్, మట్టపర్తి వెంకటరమణ, గుత్తుల శ్రీను, వార జయసావిత్రి తదితరులు పాల్గొన్నారు.


నేదునూరులో లబ్ధిదారుకి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

సాంస్కృతిక ప్రదర్శనలతో మానసికోల్లాసం

మలికిపురం: పాఠశాలలలో సాంస్కృతిక ప్రదర్శనల వల్ల విద్యార్థులకు మానసికోల్లాసం లభిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి(ఈడీవో) ఎం.కమల కుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మేడిచర్లపాలెం ఉన్నత పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. డీఈఓ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అవసరమని ఆమె అన్నారు. గ్రామంలో దాతల కృషి వారి పర్యవేక్షణలో దిన దినాభివృద్ధి చెందుతున్న పాఠశాల పనితీరుపై ప్రసంశలు కురిపించారు. ఎంఈఓ ఎం.విజయశ్రీ, సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి, ఎంపీటీసీ ముత్యాల సాయిరాం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కానూరి దుర్గ, హెచ్ఎం నాగిరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. డీఈఓ విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు.


విద్యార్థులకు బహుమతులు అందించి అభినందిస్తున్న డీఈఓ కమలకుమారి

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

అంబాజీపేట: నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో తలమునకలవుతున్న ఉద్యోగులకు క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పోలీస్ వర్సెస్ రెవెన్యూ స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను బుధవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి బదిలీపై తూర్పు గోదావరి వెళుతున్న సందర్భంగా సుధీర్‌కుమార్ రెడ్డితో స్నేహ పూర్వక మ్యాచ్ నిర్వహించామన్నారు. అనంతరం ఎస్పీని ఘనంగా సన్మానించారు. నిర్ణిత 20 ఓవర్ల మ్యాచ్‌లో ఎస్పీ జట్టు విజయం సాధించింది, ఈ మ్యాచ్‌కు అంపైర్‌గా ఓ లెవిల్ కోచ్ మట్టా సత్తిబాబు వ్యవహరించారు. వీరి వెంట కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి, తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, సీఐ డి.ప్రశాంత్‌కుమార్, హెచ్ఎం బీర హనుమంతరావు పాల్గొన్నారు.


ఎస్పీని సన్మానిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు అందినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. మెగల్తూరుకు చెందిన సి.హనుమంతరావు-హిమబిందు రూ.16,080, కాకినాడకు చెందిన కె.సతీష్‌కుమార్-లక్ష్మి కల్యాణి రూ.10,116, హైదరాబాద్‌కు చెందిన సి.శ్రీరామచంద్రమూర్తి, పద్మావతి దంపతులు రూ.10,001 విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

స్వీయరక్షణపై ప్రజలకు అవగాహన

మామిడికుదురు: ప్రమాదాల సమయంలో స్వీయ రక్షణ ఏ విధంగా చేపట్టాలి అన్న అంశంపై నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించారు. అప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇనస్పెక్టర్ రాజేంద్రకుమార్ సరోజ నేతృత్వంలో బుధవారం పలు అంశాలను వివరించారు. గుండెపోటు వచ్చిన సమయంలో తక్షణ సమాచారాన్ని అంబులెన్సుకు చేరవేయడంతో పాటు ఆ వ్యక్తిని సమాతరంగా పడుకోబెట్టాలన్నారు. అతని నాడిని పరిశీలించి దానికి అనుగుణంగా ఆ వ్యక్తి కుడి వైపు నుంచి సీపీఆర్ చేయాలన్నారు. కుడి చేతిని ఎడమ చేతితో అదిమి పట్టి 30 అంకెలు లెక్క పెట్టే వరకు సీపీఆర్ చేయాలని సూచించారు. స్థానిక విద్యార్థుల చేత దీన్ని ప్రాక్టీస్ చేయించారు. దీంతో పాటు గోదావరి వరదలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ మాట్లాడుతూ గత ఏడాది వచ్చిన గోదావరి వరదల సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ ప్రతినిధులు ఎంతో మందిని కాపాడారని గుర్తు చేశారు. వారి కృషి ఫలితంగా ఏ విధమైన ప్రాణనష్టం జరగలేదన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, హెచ్ఎం గుబ్బల సాయిబాబు, డీటీ శరణ్య, స్థానికులు పాల్గొన్నారు.


సీపీఆర్‌పై విద్యార్థినికి అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ ప్రతినిధి

ప్రపంచ మేధావి అంబేడ్కర్

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాద రావు అన్నారు. మలికిపురం డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ రోజు దేశంలో ప్రజలు ఆర్థిక పురోగతి సాధించారంటే అది అంబేడ్కర్ చలవేనని అన్నారు. ఆయన రాజ్యాంగం రాయకుంటే నేటికీ దేశం ఆకలి చావుల మధ్య కొట్టుమిట్టాడేదని అన్నారు. పేదల కోసం ఆయన రాజ్యాంగాన్ని రచించారని, ఆ రాజ్యాంగం ఆమోదానికి కృషి చేశారని అన్నారు. సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి, బత్తుల లక్ష్మణరావు, సరెళ్ళ విజయప్రసాద్, దేవ రాజేంద్రప్రసాద్, బత్తుల ఝాన్సీ, గెడ్డం తులసీ బాస్కరరావు, నల్లి శివకుమార్, గెడ్డం ఫిలిప్ రాజు, తెన్నేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

జగనన్నతోనే సమన్యాయం

ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలంటే జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పుల్లేటికుర్రులో జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తుంగలో తొక్కి ఓటు బ్యాంకు రాజకీయం చేశాయన్నారు. భవిష్యత్‌లో కూడా ఈ పథకాలన్నీ అమలు కావాలంటే అందరూ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నిలవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీ కుసుమ వెంకటేష్, దంగేటి సూర్యనారాయణ, కోట సత్యనారాయణమూర్తి, అందె వెంకటముక్తేశ్వరరావు, చిట్టూరి రాధాబాయ్, ముత్తాబత్తుల సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ, ప్రజల్ని చైతన్యవంతులను చేస్తూ ప్రతి గ్రామంలోనూ 'జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం' నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పార్టీ శ్రేణులు బుధవారం ఇంటింటికీ వెళ్లి జగన్ స్టిక్కర్లు అతికించారు. ప్రభుత్వ తీరుపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మామిడికుదురులో పార్టీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, పార్టీ నేతలు ఇంటింటికి తిరిగారు. బి.దొడ్డవరంలో వాకపల్లి వీరాస్వామి, కాండ్రేగుల శ్రీనివాస్, కేదారిశెట్టి మల్లి ప్రతి ఇంటికి వెళ్లారు. ఆదుర్రులో జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, పార్టీ శ్రేణులు ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పలు గ్రామాల్లో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నారు.


పుల్లేటికుర్రులో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మలికిపురం: సీఎం జగన్ వైపే రాష్ట్ర ప్రజలు మొగ్గు చూపుతున్నారని డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీరబ్రహ్మాజీ అన్నారు. మండలంలోని తూర్పుపాలెంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఒగ్గు వెంకట సుబ్బారావు, గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు ఆనందం రాంబాబు, సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షులు నల్లి సత్యం, రాపాక సూర్యకిరణ్, పార్టీ సచివాలయ కన్వీనర్లు పవన్, శ్రీను, కృష్ణవేణి, వలంటీర్లు పాల్గొన్నారు. కేశనపల్లిలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు యెనుముల నారాయణస్వామి, సుంకర బాబ్జి, అడబాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ సీఎం జగన్ రాష్ట్ర ప్రజలకు ఆరాధ్యుడిగా మారారని రాష్ట్ర పార్టీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాజోలు: రాష్ట్రంలో సంక్షేమానికే అధిక ప్రాధాన్యం ఇస్తూ సీఎం జగన్ పాలన సాగుతుందని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం తాటిపాక, పొదలాడ, సోంపల్లి, ములికిపల్లి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

కొత్తపేట: అనేక సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌కి ప్రజలందరూ చల్లని దీవెనలు అందించాలని గంటి సర్పంచ్ సాగి బంగార్రాజు కోరారు. గంటిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సర్పంచ్ బంగార్రాజు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఈ నాలుగేళ్ల జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. గత టీడీపీ పాలనకు సీఎం జగన్ పాలనలోని వ్యత్యాసాన్ని గమనించమని కోరారు. కార్యక్రమంలో గూడపాటి ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ ముళ్ల జనార్దన్, పీఏసీఎస్ పర్సన్ మట్టపర్తి వెంకట్రావు, భూపతిరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.